వేడుకల్లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : కలెక్టర్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 24 : వినియోగదారులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కలెక్టర్ హాజరై మాట్లాడుతూ డిజిటల్ విధానం, వర్చువల్ విచారణల ద్వారా వినియోగదారులకు సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు చేసే ప్రతి వస్తువుపట్ల జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్‌వో సరస్వతి, డీఏవో రామారావు నాయక్, డీఎం సివిల్ సప్లై హతీరామ్, వినియోగదారుల జిల్లా చైర్మన్ సాధిక్ అలీ, సభ్యుడు నవీన్ శర్మ, ఇర్ఫాన్‌ఖాన్, ప్రోగ్రామింగ్ అధికారి రవీందర్‌గౌడ్, డీటీ సీఎస్‌లు శ్రీనివాస్, దేవా పాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న చల్ల సుజాత మల్లయ్య దంపతులు

శివాలయం అభివృద్ధికి రూ.1,00,116 విరాళం

నర్మెట, డిసెంబర్ 24: మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ ఆలయ అభివృద్ధి కోసం చల్ల సుజాత మల్లయ్య దంపతులు రూ.1,00,116 విరాళాన్ని మంగళవారం ఆలయ చైర్మన్ గంగం నర్సింహారెడ్డికి అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో దేవులపల్లి భాగ్యలక్ష్మి, కూకట్ల చంద్రమౌళి, ప్రజ్ఞపురం శ్రీధర్, పాతూరి శేఖర్, కొండ బాలయ్య, తీగుళ్ల భూపతిరెడ్డి, కొన్నె తిరుపతి, అంజనేయులు, కాల్వ అశోక్, మలిపెద్ది స్వామి, మహేశ్వరం రాధాకృష్ణ, సంఘి మల్లేశం, రమేశ్, యాదగిరి, మల్లయ్య, కుమార్, రవి పాల్గొన్నారు.

తిడుగులో ఉచిత పశువైద్య శిబిరం

పశువులకు చికిత్స అందిస్తున్న పశువైద్యాధికారులు

జఫర్‌గఢ్, డిసెంబర్ 24 : మండలంలోని తిడుగులో మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా లో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడంతో పాటు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉప్పుగల్లు పశు వైద్యాధికారి డాక్టర్ కాకుమాను శ్రీనాథ్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయిస్తే పశువులకు ఆడ దూడలు పుడతాయని తెలిపారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ వై రాజేశ్వర్‌రావు, గోపాలమిత్రలు చిలువేరు నగేశ్, కత్తుల లచ్చయ్య, గుజ్జరి రాజు, ట్రైనింగ్ గోపాలమిత్ర దివ్య పాల్గొన్నారు.

గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు

దేవరుప్పుల, డిసెంబర్ 24: మండలంలోని నల్లకుంట తండా గుడుంబా తయారీ కేంద్రాలపై మంగళవారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. తండాకు చెందిన బానోత్ బుజ్జీ, బానోత్ జ్యోతి ఇళ్లలో గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు వెళ్లి తనిఖీ చేశారు. బానోత్ బుజ్జి ఇంట్లో 70 లీటర్ల బెల్లం పానకం, జ్యోతి ఇంట్లో వంద లీటర్ల బెల్లం పానకం డ్రమ్ముల్లో కనిపించగా పారబోసినట్లు ఎస్సై తెలిపారు. వీరిపై కేసు నమోదు చేయాలని కోరుతూ ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించామని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది మహ్మద్ మసూద్, యాకేశ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎల్క్ట్రిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.
NT-326623

CHANGE OF NAME
★I,Chilumula Rajeswari W/o. Bokka Krishna (Old Name) R/o 10-113/8, Palakurthy, Jangaon, T.G. hereby declare that I have changed my name to Bokka Laxmi (New Name).
NTW-000

CHANGE OF NAME
★I, YANUMULAPALLI ASHOK (Old Name) R/o H.No: 10-13-134/IV/503, Sai Ammu Residency, Kashibugga, Chowrastha Warangal-506002, T.G. Have Changed my Name as YENUMULAPALLY ASHOK (New Name).
NTW-000

CHANGE OF NAME
I, MOHAMMED JEELANI QUADRI, S/O, MOHAMMED ABDUL RAHEEM, (New Name), R/o H.No. 11-23-475, Mominpura, LB. Nagar, Warangal District TG,Have Changed my name from MOHAMMED JEELANI, S/O. MOHAMMED ABDUL RAHIM (OLD NAME),To MOHAMMED JEELANI QUADRI, S/O, MOHAMMED ABDUL RAHEEM(New Name), and Solemnly Declare.

CHANGE OF NAME
I, BILQUIS BEGUM (New Name), R/o H. No. 20-11-150, Sadar Chowk, Fort Warangal, Beside Ajmeri Mosque, Warangal Dist, Telangana State-506002,Have Changed my name from BILQIS BEGUM(OLD NAME),To BILQUIS BEGUM (New Name), and Solemnly Declare.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని
- సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ సౌజన్య

రిలే దీక్షలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ సౌజన్య

జనగామ చౌరస్తా, డిసెంబర్ 24 : సమగ్ర శిక్షా ఉద్యోగులను (ఎస్ఎస్ఏ) రెగ్యులరైజ్ చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ సౌజన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 15 రోజులకు చేరాయి. దీక్షలకు ముఖ్య అతిథిగా ఎస్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్యతో పాటు సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, బీఎస్పీ నాయకులు హాజరై తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందరికీ వెంటనే పే స్కేల్‌ను వర్తింపజేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్నప్పుడు కాం ట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఎస్ఎస్ఏ, కేజీబీవీ ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆమె కోరారు. పక్షం రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం తమ గోడు వినిపించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 27 నుంచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేశ్, ప్రధాన కార్యదర్శి బైరగోని దయాకర్ గౌడ్, కోశాధికారి గోలి రవిందర్‌రెడ్డి, గోరంట్ల యాదగిరి, రాజ్‌కుమార్, రొయ్యల రాజు, తరేశ్, కిషన్, మధు, అన్నపూర్ణ, రాధిక, మహాలక్ష్మి, సునీత, రాణి, సోని, దీనా మణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు వైష్ణవి

పొన్న వైష్ణవి

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 24 : జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పొన్న వైష్ణవి ఎంపికైనట్లు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ వీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ కేంద్రానికి చెందిన పొన్న రవి, రమాదేవి దంపతుల కూతురు వైష్ణవి కాజీపేటలో పదో తరగతి చదువుతున్నది. గత నెల 8, 9 తేదీల్లో హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని రమణ తెలిపారు. ఈ సందర్భంగా వైష్ణవిని వారు అభినందించారు. ఈ నెల 26 నుంచి 29 వరకు ముంబైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటుందని పేర్కొన్నారు.

విద్యారంగ పరిరక్షణకు యూటీఎఫ్ నిరంతర కృషి

బచ్చన్నపేటలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

బచ్చన్నపేట, డిసెంబర్ 24 : విద్యారంగ పరిరక్షణతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మండారి వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వెంకటేశ్ మాట్లాడుతూ ఈనెల 28, 29, 30, తేదీల్లో నల్లగొండలో మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాడిశెట్టి కృష్ణమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి గుండె కనకయ్య, బాల్నె శ్రీనివాస్, సద్గుణ చారి, సిహెచ్ శ్రీనివాస్, కోన రాజమౌళి, గోలి రమేశ్, కిరణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : నల్లగొండలో జరిగే యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కోశాధికారి చిక్కుడు శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఎంఈవో కార్యాలయంలో మహాసభల వాల్ పోస్టర్లను మండల విద్యాధికారి కొమురయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంపత్, కే రమేశ్ ఆవిష్కరించారు. జిల్లా కోశాధికారి చిక్కుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొప్పుల రాజు, ముదిడె రాము, ఉపాధ్యక్షుడు సలావుద్దీన్, జిల్లా నాయకులు శ్రీనాథ్, రవి, దాస్, జ్యోతి, రాజు పాల్గొన్నారు.

గూడూరు శాసనం చరిత్రను యువతకు వివరించాలి

విశ్రాంత ప్రొఫెసర్ విజయ్‌బాబు

శిలాసనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

పాలకుర్తి, డిసెంబర్ 24: తొమ్మిది శతాబ్దాల క్రితం మండలంలోని గూడూరులో వేసిన శిలాశాసనం చరిత్రను యువతకు వివరించాలని కేయూ విశ్రాంత ప్రొఫెసర్ విజయ్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని గూడూరు గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలోని శిలాశాసనం వద్ద పోతన చైతన్య వేదిక ఆధ్వర్యంలో నవ శతాబ్ది ఉత్సవాల కరపత్రాన్ని డాక్టర్ లింగంపల్లి రామచంద్రతో కలిసి ఆవిష్కరించారు. విజయ్‌బాబు మాట్లాడుతూ గూడూరు శిలాశసనాన్ని క్రీస్తు శకం1124లో విర్యాల వంశీయులు ప్రతిష్ఠించారన్నారు. 200 సంవత్సరాల పాటు భారతీయులను దోపిడీ చేసిన బ్రిటీష్ పాలకులు ఇక్కడి వారసత్వ సంపదను కాపాడారని చెప్పారు. శిలాశాసన చరిత్రను భావితరాలకు అందించేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రముఖ విద్యావేత్త డాక్టర్ చుక్కా రామయ్య, స్వాతంత్ర్య సమరయోధుడు చౌడవరపు విశ్వనాథం లాం టి మహనీయులకు జన్మనిచ్చిన గూడూరు గొప్ప ప్రాంతమని కొనియాడారు. దీనిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు. కాకతీయుల కాలంలో విర్యాల వంశీయులు గూడూరును రాజధానిగా చేసుకుని పాలన సాగించారన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక అధ్యక్షుడు అనుముల ఎల్లయ్య, కార్యదర్శి ఆర్తి పరంకుశం, మాజీ ప్రొఫెసర్ ఎల్లంబట్ల నాగయ్య, డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్, డాక్టర్ రాపోలు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్య, దుర్గా ప్రసాద్ శర్మ, పంచాయతీ కార్యదర్శి చుక్కా లింగయ్య, మాన్యపు బుజేందర్, శేషయ్య, వీరమల్ల బాబూరావు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌కు పలువురి పరామర్శ

నరేందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 24 : మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్, తాటికొండకు చెందిన దూదిపాల నరేందర్‌రెడ్డిని మాజీ వైఎస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. నరేందర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురైన నేపథ్యంలో పలువురు నాయకులు కలిసి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. వీరిలో బేతి జయపాల్ రెడ్డి, ఎడమ కట్టుమల్లు, మార్క శ్రీనివాస్, బేతి రామచంద్రారెడ్డి, ఘనపురం వీరస్వామి, మారపాక శ్రీనివాస్, తాటికొండ సంపత్ యాదవ్ ఉన్నారు.

కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి

జనగామ చౌరస్తా, డిసెంబర్ 24 : ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో క్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. జిల్లా ప్రజలందరికీ క్రిస్మస్, 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేదలతో పాటు అవసరార్థులకు సహాయం అందించి శాంటా క్లాస్ లాగా వారి జీవితాల్లో వెలుగులు నింపాలని సూచించారు. అందరూ ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అనంతరం పలువురు క్రైస్తవులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రవిందర్, ఎస్సీ సంక్షేమ అధికారి విక్రమ్, పాస్టర్ ఫ్రాన్సిస్, సిస్టర్స్ డాక్టర్ ఇన్నమ్మ, మేరీ, కలెక్టరేట్ ఏవో మన్సూరీ పాల్గొన్నారు.

ఏజీపీ చంద్రఋషికి సన్మానం

చంద్రఋషిని సన్మానిస్తున్న పంతులు ప్రభాకర్‌రావు

జనగామ, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని సీనియర్ సివిల్ కోర్టులో అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ (ఏజీపీ)గా నియమితులైన ఎలగందుల చంద్రఋషిని మంగళవారం నవ తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పంతులు ప్రభాకర్‌రావు సన్మానించారు. దివ్యాంగులకు న్యాయపరమైన సలహాలు, సూచనలను అందించి చేయూతనివ్వాలని కోరారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి : సీపీఎం

జనగామ చౌరస్తా, డిసెంబర్ 24 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో క్రియాశీల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రకాశ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సైతం అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించలేదన్నారు. దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణ చెప్పకుంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలందరితో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాల్నె వెంకటమల్లయ్య, లింగం, శ్రావణ్, వరలక్ష్మి, సుమ, యాకయ్య, లక్ష్మి, శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.


మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాజయ్య

మృతుడి కుటుంబానికి రాజయ్య పరామర్శ

లింగాలఘనపురం, డిసెంబర్ 24 : మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ గట్టగల్ల యాదయ్య కుటుంబాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మంగళవారం పరామర్శించారు. ఈ నెల 22న యాదయ్య మృతి చెందారు. ఈనేపథ్యంలో ఆయన పెద్ద కుమారుడు గట్టగల్ల మహేందర్ ఉపాధి కోసం కెనడాకు వెళ్లాడు. మంగళవారం ఆయన రావడంతో అంత్యక్రియలు నిర్వహించారు. యాదయ్య పార్థివ దేహానికి రాజయ్య నివాళులర్పించారు. బీఆర్ఎస్ బలోపేతానికి యాదయ్య అందించిన సేవలను రాజయ్య గుర్తు చేశారు. కార్యక్రమంలో కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సేవెల్లి సంపత్, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఏదునూరి వీరన్న, కేమిడి యాదగిరి, వెంకటేశ్, ఉడుగుల భాగ్యలక్ష్మి, ఎడ్ల రాజు, బెజ్జం చంద్రయ్య, గట్టగల్ల శ్రీహరి పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న హసీఫ్

హోంగార్డు కుటుంబానికి చేయూత

కొడకండ్ల, డిసెంబర్ 24 : మండల కేంద్రానికి చెందిన హంగార్డు గులాం గౌస్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబం ఆర్థిక ఇబ్బందులుతో బాధపడుతున్నందున మంగళవారం బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎండీ హసీఫ్ ఆధ్వర్యంలో చేయూతనందించారు. హ్యాపీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ టీ కాంతికుమార్ రూ.20 వేలను అందజేసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మృతుడి కుటుంబానికి పలువురి ఆర్థిక సాయం

యాకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర నాయకులు

దేవరుప్పుల, డిసెంబర్ 24: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సమగ్రశిక్ష పథకంలో తాత్కాలిక మెసేంజర్‌గా పనిచేస్తున్న మరిపల్లి యాకయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబాన్ని సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీసౌజన్య, మెసేంజర్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి రుద్రగిరి,సమగ్ర ఉద్యోగుల సంఘ అసోసియేటెడ్ అధ్యక్షుడు సాంబశివరావు మండలంలోని కామారెడ్డిగూడెంలో ఉన్న మృతుడి ఇంటికి వచ్చి అతడి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మృతుడి భార్య వాణి, అతడి కూతురు, కుమారున్ని ఓదార్చి రూ.15 వేలు సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా మెసెంజర్ల సంఘం అధ్యక్షుడు సంజీవ, జిల్లా బాధ్యుడు గోలి రవీందర్‌రెడ్డి, సహ ఉద్యోగులు మార్గం నర్సింహులు, యాకస్వామి పాల్గొన్నారు

చికిత్స పొందుతూ బీఆర్ఎస్ నాయకుడి మృతి

రొడ్డ రాములు (ఫైల్)

పాలకుర్తి, డిసెంబర్ 24: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని బమ్మెరలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బమ్మెరకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు రొడ్డ రాములు(48) ఈ నెల 21వ తేదీన తన ఆటోలో పెద్ద తండా(బీ) నుంచి బమ్మెరకు వస్తున్నాడు. రోడ్డుపై ధాన్యం రాశిని అతడు గమనించకపోవడంతో ఆటో బోల్తాపడింది. దీంతో డ్రైవర్ రాములుతో పాటు ఆటోలో వస్తున్న మరో వ్యక్తికి గాయాలయ్యాయి. బాధితులను చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించగా, రాములు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. రాములు మృతికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వైస్ ఎంపీపీ దార శారద శంకరయ్య, జోగు గోపీ, రంగినేని సత్యనారాయణరావు, బత్తిని గోపాల్, ఎన్నకూస యాకయ్య సంతాపం ప్రకటించారు.

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలు, బాధితులకు మేలు : ఎమ్మెల్యే

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పాలకుర్తి, డిసెంబర్ 24: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం(సీఎంఆర్ఎఫ్) పేదలకు, బాధితులకు వరమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాలకు చెందిన 62 మంది లబ్ధిదారులకు రూ.23 లక్షల 45 వేల విలువైన చెక్కులను ఆమె పంపిణీ చేశారు. యశస్వినీరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్‌తో ఎంతో మంది పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సాయం అందిస్తున్నామని ఆమె తెలిపారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అర్హులందరికీ న్యాయం చేస్తామని యశస్వినీరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, నల్ల శ్రీరాం, ధరావత్ సురేశ్ నాయక్, నాయకులు బైర్ భార్గవ్, ఎలూరు యాకయ్య, కమ్మగాని నాగయ్య, జలగం కుమార్, గడ్డం యాకసోమయ్య, గుగ్గిళ్ల ఆదినారాయణ, గాదెపాక భాస్కర్, కామారపు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్లతో ఇద్దరి అకౌంట్లలో డబ్బులు స్వాహా

కొడకండ్ల, డిసెంబర్ 24 : సైబర్ మోసగాళ్ల ఉచ్చులో ఇద్దరు అమాయకులు చిక్కి డబ్బులు పోగొట్టున్న ఉదంతం మండల కేంద్రంలో వెలుగు చూసింది. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాపోలు భాస్కర్‌కు ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి కేవైసీ నవీకరణ నిమిత్తం కాల్ చేస్తున్నామని చెప్పి సైబర్ మోసగాడు ఫోన్ చేశాడు. బ్యాంక్ అకౌంట్ నంబర్, డెబిట్ కార్డు వివరాలు తెలుసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత భాస్కర్ అకౌంట్ నుంచి రూ.9,050 డ్రా అయ్యాయి. జరిగిన మోసంపై బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై రాజు కేసు నమోదు చేశారు. మరోవైపు మండల కేంద్రానికి చెందిన బొమ్మెరబోయిన ప్రశాంత్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తాను పోలీసు అని తెలిపి రూ.50 వేలు పంపాలని కోరాడు. దీనిని నమ్మిన ప్రశాంత్ అతడు కోరినట్లు డబ్బులు పంపాడు. మోసాన్ని ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. అపరిచితుల నుంచి ఫోన్లు వస్తే మాట్లాడవద్దని సూచించారు. బ్యాంకు అకౌంట్ నంబర్, ఓటీపీలు అడిగితే చెప్పవద్దని ఆయన కోరారు.

సొంత పనులకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్

గడ్డి కట్టలతో గ్రామపంచాయతీ ట్రాక్టర్

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 24 : గ్రామ పంచాయతీ అవసరాల కోసం వినియోగించాల్సిన ట్రాక్టర్‌ను సొంత పనులకు వినియోగించిన వైనం మండలంలోని విశ్వనాథపుర